క్లుప్తంగా

గాంధారీ మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



భీమారం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సదానందం, ఆదివాసీ నాయకులు

భీమారం/భీమిని: ఈ నెల 14, 15, 16తేదీల్లో నిర్వహించే గాంధారీమైసమ్మ జాతర పోస్టర్‌ను బుధవారం భీమారంలో తహసీల్దార్ సదానందం, భీమినిలో కన్నెపల్లి ఎస్సై గంగారాం ఆదివాసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆదివాసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తైనేని రవి, మార్నేని లక్ష్మణ్, మార్నేని చంద్రయ్య, చింతల శశికుమార్, భూనేని తిరుపతి, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి తలండి అశోక్, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా జాయింట్ కార్యదర్శి ఐద శంకర్, నాయకులు దునే కృష్ణ, ఎదుల మోహన్, సత్తయ్య, చంద్రయ్య, ఐద సంతోష్, రవి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



మూసి ఉంచిన దుకాణాలు

జన్నారం: వాహనాల రాకపోకలపై అటవీశాఖ అధికారులు పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలనే డిమాండ్‌తో బుధవారం చేపట్టిన జన్నారం బంద్ విజయవంతం అయింది. వ్యాపారస్తులు, దుకాణ యజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఎలాంటి ఆందోళనలు జరగకుండా ఎస్సై రాజవర్ధన్ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట, దండేపల్లి ఎస్సైలు సతీశ్, ఉదయ్‌కుమార్ బందోబస్తు చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉన్నందునా ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు చేయొద్దని పోలీసులు సూచించారు. ఆందోళనకు దిగితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కొందరు యువకులు ధర్నా చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. ఎలాంటి ఆందోళనలు లేకుండా సామరస్యంగా బంద్ విజయవంతం అయింది.

20న 'చలో హైదరాబాద్'

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలల కాలం గడిచినప్పటికీ, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పోడు భూములకు పట్టాలు, రూ.4వేల పింఛన్‌లు, యువవికాసం, పేదలకు వైద్యం, ప్రజాస్వామిక హక్కులు కాపాడతామని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను విస్మరించిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఈ నెల 20న హైదరాబాద్‌లో న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో వేలాది మందితో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ తీర్మానించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మానందం, తాళ్లపల్లి శ్రీనివాస్, జ్యోతి, మల్లన్న, శ్రీకాంత్, ఎండీ జాఫర్ రత్నం, తిరుపతి, రెడ్డి చరణ్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ లక్ష్మి భర్త అక్కెపల్లి బుగ్గరాజు ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. రాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చెంద్రయ్య, మాజీ ఎంపీటీసీ రాంచందర్, నాయకులు అగ్గి సత్యం, మోటూరి వేణు, వాసుదేవ్, లంక లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సదస్సు విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఈ నెల 8న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మత్స్య మహిళ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోడంకి చందు అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో బుధవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిత్యశ్రీ, చిన్నమ్మ, లక్ష్మి, గుమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అనఘాష్టమి వ్రతం



మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో బుధవారం సామూహిక శ్రీ అనఘాష్టమి (గురుదత్తాత్రేయ) వ్రతం ఘనంగా నిర్వహించారు. గణపతి సచ్చిదానందస్వామిజీ, ఉత్తర పీఠాధిపతి దత్త విజయానందతీర్థ స్వామిజీ దివ్యాశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గురుదత్తాత్రేయ పూజ, అర్చన కార్యక్రమంలో అర్చకుడు వేణుగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణప్రతిష్ఠ పూజలు



మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల దుబ్బపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మిట్టపల్లి సత్యనారాయణశాస్త్రి, వేదపండితులు కట్టా నరసింహశాస్త్రి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

'ధరణి' మొరాయింపు-ప్రజల పడిగాపులు



దండేపల్లి: మూడు రోజులుగా ధరణి పోర్టల్ సర్వర్ మొరాయిస్తుంది. భూముల రిజిస్ట్రేషన్లు, సక్సేషన్లు, పార్టీషన్లకు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకున్నవారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే సర్వర్ మొరాయించడంతో మూడు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సమస్య ఎప్పుడు క్లియర్ అవుతుందో అని ఎదురు చూస్తున్నారు.

సహకారం.. సందిగ్ధం!

- ఈ నెల 16తో ముగియనున్న సహకార సంఘాల గడువు
- పదవీకాలం పొడిగింపా.. ఇన్‌చార్జుల నియామకమా..?
- స్పష్టతనివ్వని అధికారులు



నెల్కివెంకటాపూర్ సహకార సంఘ భవనం

దండేపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలకవర్గం గడువు మరికొద్ది రోజుల్లో ముగియనుంది. పదవీ కాలానికి ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కానీ ఈసారి అలాంటిది ఏమీ కనిపించడం లేదు. రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఎన్నికల ప్రకటన విడుదల కాలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 16తో పాలకవర్గ పదవీకాలం ముగుస్తోంది. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై సర్వత్రా చర్చసాగుతోంది. జిల్లాలోని 20సహకార సంఘాలకు 2020ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు.

కొత్తగా మరో మూడు సంఘాలు..

మంచిర్యాల జిల్లాలో ఇప్పటివరకు 20సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 15సంఘాలు డీసీసీబీ, మరో 5సంఘాలకు ఎస్‌బీఐ ద్వారా ఆర్థిక సహకారం అందుతుంది. అయితే జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో కూడా సహకార సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం జిల్లాలోని భీమారం, నస్పూర్, కన్నెపల్లిలో కొత్తగా సహకార సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు కూడా పంపించినట్లు తెలిపారు. దీంతో కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం లభిస్తే, జిల్లాలో సహకార సంఘాల సంఖ్య 23కు చేరనుంది.

పొడిగింపా లేదా ఇన్‌చార్జులా?..

సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు జరిగే అవకాశం కనిపించకపోవడంతో, వీటిని వాయిదా వేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల పాలకవర్గాలు గడవు పూర్తవడంతో సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో, ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి తీసుకొచ్చింది. స్థానిక సంస్థల మాదిరిగానే సహకార సంఘాలకు కూడా పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తుందా లేదా పదవీకాలం పొడగిస్తారా అనే దానిపై స్పష్టత లేదు.

ఇప్పుడే చెప్పలేం..

ఈ నెల 16తో జిల్లాలోని 20సహకార సంఘాల పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుంది. సంఘాలకు పదవీకాలం పొడగిస్తారా లేదా ప్రత్యేకాధికారులను నియమిస్తారా అనేది ప్రభుత్వ ఆదేశాల ద్వారా తెలుస్తుంది. అప్పటివరకు ఏమీ చెప్పలేం.

– సంజీవరెడ్డి, డీసీవో

మహిళాశక్తి క్యాంటీన్లలో రుచికరమైన భోజనం



క్యాంటీన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మందమర్రిరూరల్: మందమర్రి మండల సమాఖ్య(ఐకేపీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లో రుచికరమైన టీ, టిఫిన్లు, భోజనాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే క్యాంటిన్‌ను బుధవారం డీఆర్డీవో కిషన్‌తో కలిసి ప్రారంభించారు. మహిళల ద్వారా నిర్వహించే ఈ క్యాంటీన్‌ను ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఐకేపీ ఏపీఎం లలితాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతిపత్రం అందించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: కులగణన సర్వేకు సంబంధించిన వివరాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు గాను మంచిర్యాల పట్టణంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు.

యోగా చేసి... ఓట్లు అడిగి



యోగా చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, రాముని చెరువు పార్కులో బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో యోగా చేస్తున్న వారితో కలిసి యోగా చేశారు. టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మొదటి ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేశ్, తులా ఆంజనేయులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



నెన్నెల: క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్/వేమనపల్లి/నెన్నెల: పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడంతో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తాండూర్ ఐబీ కేంద్రం అండర్ బ్రిడ్జి వద్ద, వేమనపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద, నెన్నెలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ తాండూర్ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహీధర్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మహిళ మోర్చా బీసీ ఉపాధ్యక్షురాలు శీతల్, మండల ప్రధాన కార్యదర్శి పుట్టకుమార్, వేమనపల్లిలో మండలాధ్యక్షుడు ఏట మధుకర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ మడె శ్రీకాంత్, ఎనుముల వెంకటేష్, కంపెల అజయ్, నెన్నెలలో బీజేపీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్, నాయకులు శైలేందర్‌సింగ్, కోట వంశి, గట్టు పవన్, లింగంపల్లి మహేష్, దుర్గం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు మేలు చేసే విధంగా ఉందని, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఖలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, రాయమల్లు, మహేష్, సీఐటీయూ నాయకులు ప్రకాష్, సాయితేజ, సాగర్, ఐఎఫ్‌టీయూ నాయకులు జాఫర్, సురేందర్, సయ్యద్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

అధికారులూ.. బావి పూడ్చరూ!



భీమారం: మండల కేంద్రంలోని కొత్తగూడెంలో 40ఏళ్ల క్రితం నీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం బావిని నిర్మించింది. దీనిని స్థానికులు అప్పట్లో వినియోగించుకున్నప్పటికీ, ప్రస్తుతం నిరుపమోగంగా ఉంది. బావిని పూడ్చివేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బావిని మట్టితో పూడ్చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సతీష్ రెడ్డి, ప్రత్యేక అధికారి, భీమారం ఫోన్ నంబర్ : 98483 84636

కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతి అందిస్తున్న గని మేనేజర్ భూశంకరయ్య

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1ఇంక్లైన్ గనిపై బుధవారం గని మేనేజర్ భూశంకరయ్య కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గనిలో ఉత్పత్తి పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి జీవన్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి 2020–21 సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ చీటీలను పంపిణీ చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, బోనస్, ఇతర చట్టబద్ధహక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాజేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సదానందం, నాయకులు జిల్లా తిరుపతి, మిట్టపల్లి మొగిలి, సామల కిషోర్ కుమార్, గుంట రాజు, కిషన్, కలవేన స్వామి, నీరటి సురేష్, బోయిన కుమార్ పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన'

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. టేకుల బస్తీలో సీఐటీయూ కార్యాలయం ఎదుట బుధవారం బడ్జెట్ ప్రతులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి అని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న బడ్జెట్ వల్ల పేదలకు, కార్మికులు, కర్షకులకు కలిగే మేలేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రాజమణి, సభ్యులు అనురాధ, పద్మావతి, ముత్యాలు, అనంతలక్ష్మి, పద్మ, తిరుపతి, రవీందర్, శ్రీకాంత్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

శ్రీరాంపూర్: కేంద్ర బడ్జెట్‌పై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ మండల కన్వీనర్ కాసిపేట రాజేశం, నాయకులు గట్టు మహేందర్, సమ్మయ్య, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

'పని స్థలాల్లో నిర్లక్ష్యం వద్దు'



గని ప్లాన్ పరిశీలిస్తున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం

మందమర్రిరూరల్: గనుల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పనిస్థలాల్లో నిర్లక్ష్యం చేయొద్దని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని కేకే–ఓసీని బుధవారం ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి ఆయన సందర్శించి పని ప్రదేశాలను పరిశీంచారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తుందని, సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో రక్షణ సూత్రాలు పాటించి లక్ష్యం సాధించాలని తెలిపారు. గని పని ప్రదేశాలకు సంబంధించిన ప్లాన్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గని అధికారులు సురేష్, శ్రీధర్‌గౌడ్, కుష్వా ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో క్లర్కులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్(సిక్కా) నాయకులు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో సిక్కా ఏరియా ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య మాట్లాడారు. సింగరేణిలో క్లర్క్‌లపై పనిభారం పెరిగిందన్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని వాపోయారు. క్లరికల్ పరీక్షలు నిర్వహించి ఖాళీలు భర్తీ చేయాలన్నారు. మహిళా కార్మికులకు విడిగా వాష్‌రూంలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సిక్కా ఏరియా గౌరవ సలహాదారులు లక్ష్మణ్, ఏరియా సెక్రెటరీ శ్రీధర్, కోశాధికారి రవి, జాయింట్ సెక్రెటరీలు బుచ్చయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఇందారంలో మిలిటరీ ఇంజినీర్ల పర్యటన

జైపూర్: ఇందారం గ్రామంలో బుధవారం మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ అధికారులు పర్యటించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల స్థితిగతులు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో వారి భాగస్వామ్యం, ఆర్థిక పురోగతి అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీ, కంపోస్టు ఎరువు తయారీ విధానం పరిశీలించారు.

గుండెపోటుతో టిప్పర్ డ్రైవర్ మృతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ మైన్స్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవీందర్ సింగ్(36) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని కాటనీ జిల్లాకు చెందిన రవీందర్ సింగ్ 7నెలల క్రితం దేవాపూర్‌కు వచ్చి మైన్స్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని బ్యారక్‌లలో పడుకొని చాతిలో నొప్పిగా ఉందని తెలపగా తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.